క్లుప్తంగా

దత్తసాయి ఆలయానికి విరాళం



రూ.2 లక్షలు అందజేస్తున్న దాత

గోస్పాడు : స్థానిక దత్తసాయి ఆలయానికి మంగళవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. కొండుపల్లె గ్రామానికి చెందిన సానె చెన్నమ్మ జ్ఞాపకార్థం భర్త సానె చెన్నప్ప రూ.2లక్షలు, గోస్పాడుకు చెందిన నారా చంద్రమౌళీశ్వరరెడ్డి రూ. 50వేలు, వెన్నపూస నాగిరెడ్డి రూ.25వేలను ఆలయసేవకుడు మహేశ్వరరెడ్డికి అందజేశారు. స్వామివారి ఆలయం వద్ద ముఖద్వార నిర్మాణం ఏర్పాటు చేసేందుకు దాతలు విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

గోస్పాడు: బాల్యవివాహాలను అరికడదామని నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ పిలుపునిచ్చారు. మండలంలోని యాళ్లూరు హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల మాతాశిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా, నిర్వహించినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, హైస్కూల్ హెచ్ఎం నాగేంద్ర, సూపర్‌వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో సెప్టెంబర్ 1న సాగు, తాగునీరు ప్రాజెక్టుల సాధనకై నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ 26 జిల్లాల్లో సీపీఐ బస్సు యాత్ర పర్యటించి 1వ తేదీన నంద్యాలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడ జరిగే సదస్సును ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బాబాఫక్రుద్దీన్, నాగరాముడు, ధనుంజయుడు, సోమన్న, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి

నంద్యాల(సెంట్రల్): ఈ-క్రాప్ నమోదులో సిబ్బంది చురుగ్గా పనిచేసి శతశాతం పూర్తికి కృషి చేయాలని నంద్యాల సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ హేమసుందరరెడ్డి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలోని 6 మండలాల పరిధిలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 53,448 హెక్టార్లు కాగా ఇప్పటి వరకూ 18,002 హెక్టార్లలో పలు పంటలు సాగైనట్లు తెలిపారు. వీటికి సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోందన్నారు. ఇప్పటి వరకు 11 వేల హెక్టార్లలో పంట నమోదు పూర్తి చేశామన్నారు. సెప్టెంబర్ 15 లోగా వందశాతం లక్ష్యాన్ని చేరుకునే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రైతన్నలు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత వ్యవసాయ సహాయకుల్ని కలిసి విధిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

హిందూ ధర్మాన్ని రక్షించుకుందాం

శిరివెళ్ల: హిందూ ధర్మాన్ని రక్షించుకుందామని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తానంద అన్నా రు. గోవిందపల్లెలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు రామాయణంలోని ప్రవచనాలు వినిపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ధర్మ ప్రచారక్ డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వైపీ రామయ్య, సర్పంచు నక్కా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



ఆర్బీకేకు తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలో రూ.3.92 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు బుధవారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌నాయుడు తెలిపారు. చాకరాజు వేముల గ్రామంలో రూ.48లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, డబ్ల్యూ గోవిందిన్నెల్లో రూ.2కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, దొర్నిపాడులో రూ.44లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించనున్నారు. అలాగే దొర్నిపాడు నుంచి వెంకటేశ్వరనగరం గ్రామానికి రూ.కోటితో నూతనంగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును కూడా ప్రారంభిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి.

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రదానం



హెచ్ఎంలను సత్కరించిన ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు, తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిడుగురామ్మూర్తి, పద్మభూషణ్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు క్రీడలకు చాలా ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర సీఎం కప్ కో ఆర్డినేటర్ ఏపీ రెడ్డి మాట్లాడుతూ క్రీడా ప్రతిభా పురస్కారాల వల్ల క్రీడాకారుల్లో ఎంతో స్ఫూర్తి కలుగుతుందని చెప్పారు. జిల్లాస్థాయిలో క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన ఐదు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులను, వ్యాయామ ఉపాధ్యాయులను శాసన మండలి సభ్యులు మెమొంటో, శాలువా, సర్టిఫికెట్లతో సత్కరించారు. నంద్యాల జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా క్రీడా ప్రతిభ అవార్డులలో మొదటి స్థానం డోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెండో స్థానం యూ.కొత్తపల్లి, మూడో స్థానం కొలిమిగుండ్ల, నాల్గవ స్థానం పేరుసోముల, ఐదవ స్థానం దీబగుంట్ల కస్తూరిబా బాలికా విద్యాలయం, ఆళ్లగడ్డ పాఠశాలకు బహుమతులు దక్కాయన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు దండె నాగరాజు, నాగేంద్ర, రాణెమ్మ, సుధాకర్, షేక్షావలి, దేవేంద్ర, ప్రతాప్, శ్రీధర్, విశ్వనాథ్, శ్రీలత, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు

నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం రోజున జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. పోటీల్లో గెలుపొందిన వారు వచ్చే నెలలో నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని నంద్యాల జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పీవీ సుధాకర్‌రెడ్డి, సోమేసుల నాగరాజు, కూరప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌లో 10 జట్లు పాల్గొనగా టెక్కె స్కూల్ విజయం సాధించిందని క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు రాజు తెలిపారు. హాకీ క్రీడల్లో కేశవరెడ్డి స్కూల్ విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ పోటీల్లో 7 జట్లు పోటీపడగా ఎస్‌డీఆర్ స్కూల్ విజేతగా నిలిచిందన్నారు. వాలీబాల్ పోటీల్లో బనగానపల్లె, నంద్యాల జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో బనగానపల్లె జట్టు విజయం సాధించిందని ఆయన తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో మెడల్ సాధించిన వారికి ట్రాక్ షూట్‌లను బహుమతులుగా అందజేసి ఘనంగా సన్మానించారు.

గ్రీన్‌సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం

గ్రీన్‌సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పురపాలక ఉన్నత పాఠశాల, శారదా విద్యాపీఠం పాఠశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వే మాధవరెడ్డి, దండు వెంకటేశ్వర్లు, రోటరీ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం చలపతి, మద్రెడ్డి, గ్రీన్‌సొసైటీ సభ్యులు నీలకంఠమాచారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజరాణి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, తెలుగు విభాగ అధ్యక్షులు రామలింగారెడ్డి, శ్రీనివాసులు అధ్యాపకులు పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దుకాణాల వేలాలతో ఆదాయం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో పట్టణంలోని 11 మున్సిపల్ దుకాణాలకు మంగళవారం వేలం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 10 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన 11 దుకాణాలకు వేలం నిర్వహించామన్నా రు. దుకాణాల నుంచి మున్సిపాలిటీకి రూ. 1,01,400 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి వెంకటకృష్ణ, ఆర్ఐ గులాం హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టి అధిక లాభాలు పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం ఆయ న తన కార్యాలయంలో మాట్లాడుతూ.. మొత్తం 17 రకాల తోటలకు సంబంధించి నాటిన రోజు నుంచి 3 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు. తోటల్లో సూక్ష్మనీటి విభాగం కింద డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సైతం 90 శాతం రాయితీ ఇస్తున్నారని వెల్లడించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ : పట్టణ శివారులోని ఏపీ గోడౌన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివప్రసాద్‌రెడ్డి (61) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. పట్టణంలోని నెహ్రూ వీధికి చెందిన శివప్రసాద్‌రెడ్డి మూడు రోజుల క్రితం పట్టణ శివారులోని ఏపీ గోడౌన్ సమీపంలోని హైవే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపునుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివప్రసాద్‌రెడ్డిని నంద్యాల వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడని తెలిపారు

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి



ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాను గజమాలతో సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

ఆళ్లగడ్డ : ముస్లి మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. మంగళవారం నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన అంజాద్ బాషాతో పాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డిలను ఆళ్లగడ్డ ముస్లిం మైనార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. అంజాద్ బాషా మాట్లాడుతూ మైనారీల మనోభావాలను గౌరవిస్తూ వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సలాం, ఎంపీపీ వసీం, నజీర్ ఉన్నారు.

పసిడి వెన్నెల భాష తెలుగు



చాగలమర్రిలో తెలుగు అక్షరమాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

- ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): సాహిత్య సౌరభాలతో విరాజిల్లే తెలుగు పసిడి వెన్నెల భాష అని మాతృ భాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ హయగ్రీవాచార్యులు అన్నారు. మంగళవారం తెలుగుభాష దినోత్సవం సందర్భంగా ఎల్‌కేఆర్ గ్లోబల్ స్కూల్‌లో మాతృభాషకు వందనం అనే అంశంపై చర్చ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ లక్ష్మీకాంతరెడ్డి, కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, తదితరులు పాల్గొన్నారు.

● కేఎస్ఎం మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అసదుల్లా హుసేన్ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ విద్యార్థి డాక్టర్ రవికృష్ణ పాల్గొని తెలుగుభాషా గొప్పదనం, ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం గత సంవత్సరం పదవ తరగతి నందు అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, ప్రసాదరెడ్డి, సీతారామిరెడ్డి, తిరుపాలు, శిరీష పాల్గొన్నారు.

● నంద్యాల ఆర్టీసీ డిపోలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ హయగ్రీవాచారి హాజరై తెలుగుభాష ప్రముఖ్యతను వివరించారు. అనంతరం డిపో మేనేజర్ గంగాధర్ హయగ్రీవాచారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు, అల్లాబకాష్, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష గొప్పతనం చాటుదాం

దొర్నిపాడు: తెలుగభాష గొప్పతనం విద్యార్థి దశ నుంచే చాటిచెప్పాలని హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు హుసేన్‌రెడ్డి, నాగర్జునగౌడ్, అల్తాఫ్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం సాంస్కృతిక పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకోని ద్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీ దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగలమర్రిలో తెలుగుభాషా దినోత్సవం

చాగలమర్రి: స్థానిక కేజీబీవీలో విద్యాలయ ఎస్‌ఓ సునిత ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో విద్యార్థినులకు వ్యాసరచన, పద్య రచన పోటీలు నిర్వహించారు. . అలాగే వ్యాయామ ఉపాధ్యాయురాలు అలివేలు బాయి విద్యార్థినులతో ఆసనాలు వేయించి, పరుగు పందేలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అలాగే స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎం.కొటయ్య ఆధ్వర్యంలో గిడుగు రామూర్తి, హాకి క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు బాల మునయ్యను సన్మానించారు. అలాగే బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తెలుగు పద అక్షరాల మాదిరి కూర్చోబెట్టి తెలుగు భాషపై తమకున్న మమకారాన్ని తెలుగు ఉపాధ్యాయులు గౌసుల్ ఆజం, శ్రీనివాసులు చాటుకున్నారు. కార్యక్రమంలో పీఈటీ ముల్లా.దాదాపీర్, భారతీ, ఉపాధ్యాయ సిబ్బంది శాస్త్రి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేఎస్ఎం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హయగ్రీవాచారిని సన్మానిస్తున్న దృశ్యం

మాతృభాషను మరువరాదు

ఉయ్యాలవాడ: మాతృభాషను ఎప్పటికీ మరువరాదని హెచ్ఎం నరసింహుడు తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు మహేశ్వరి, క్రీడా ఉపాధ్యాయుడు నరసింహుడును శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



తెలుగు సాంప్రదాయ దుస్తులు ధరించిన చాగలమర్రి కేజీబీవీ విద్యార్థినులు



దొర్నిపాడులో తెలుగు ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం



కొండుపల్లె ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మికం

వర్షం కోసం గంగమ్మకు పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న బెస్త కాలనీ వాసులు

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీ వాసులు మంగళవారం వర్షం కోసం గంగమ్మకు పూజలు చేశారు. ఉదయాన్నే కాలనీ వాసులు తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపైకి చేరుకున్నారు. అక్కడ నైవేద్యాలు సిద్ధం చేసుకొని బోనాలతో కట్టపై మరో చోట కొలువైన గంగమ్మ అమ్మవారి చెంతకు ఊరేగింపుగా మేళ తాళాలతో వెళ్లి వాటిని సమర్పించారు. వర్షం కురిపించాలని వేడుకుంటు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేపట్టారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించిన అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవ నగర్ రామాలయంలో వెలసిన శ్రీభక్తాంజనేయ స్వామికి శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు పవన్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారిని ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం సింధూరాభిషేకం చేపట్టారు. అనంతరం స్వామి వారిని 108 వడలతో అలంకరించారు. స్వామికి మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తెలుగుగంగలో నిలిచిన నీటి ప్రవాహం





తెలుగుగంగ ప్రధాన కాల్వలో అరకొరగా పారుతున్న నీరు, 19వ బ్లాక్ కాల్వలో నుంచి నీరు తోడుతున్న ఆయిల్ ఇంజన్

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వల్లో సాగు నీటి ప్రవాహం మంగళవారం నాటికి నిలిచింది. దీంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు ఉప ప్రధాన కాల్వల్లో అక్కడక్కడ నిల్వ ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్ల ద్వారా పంటలకు పారించుకుంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు మొక్క జొన్న, మినుము, పత్తి వంటి పంటలు సాగు చేశారు. అలాగే బోరు బావుల కింద వరి సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు సాగు చేసిన పంటలు వాడు ముఖం పట్టాయి. సమస్య తెలుసుకున్న ప్రభుత్వం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. సాగు నీరు అందుబాటులోకి రాగానే రైతులు ఆ నిటిని వాడు ముఖం పట్టిన పంటలకు పలు రకాలుగా పారించుకున్నారు. కొద్ది రోజుల్లోనే పంటలు ఊపిరి పోసుకొని కళకలాడుతున్నాయి. మరో తడి సాగు నీరు అందిస్తే గట్టెక్కుతామన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

ఆధునిక సాంకేతికతకు పెద్దపీట



ఘనీకృత వీర్య కేంద్రంలో పశువుల పాక నిర్మాణ పనుల్ని పరిశీలిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): పశుగణాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నట్టు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ జీ.విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక బొగ్గులైన్‌లోని ఘనీకృత వీర్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో వీర్య ఉత్పత్తిని, పశువుల సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్త గా నిర్మిస్తున్న పశువుల పాక సహా ఇతర నిర్మాణాల పనుల్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్ని వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల పశుగణాభివృద్ధి సంస్థల చైర్మన్లు ఎస్.వీ. జగన్‌మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, పీ.సంతోష్‌కుమార్, సహాయ ముఖ్య కార్యనిర్వహణాధికారి రజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: రాష్ట్ర పశుసంవర్థక శాఖ చైర్మన్ విజయ్ కుమార్ మంగళవారం రాత్రి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని ఆయనకు స్వాగతం పలికారు. వైఎస్సార్ జిల్లా జోన్ చైర్మన్ మాధవరెడ్డి, తిరుపతి జోన్ చైర్మన్ సంతోష్‌కుమార్‌లతో కలిసి వచ్చిన వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక కల్యాణ మండపంలో వారికి స్వామి,అమ్మవారి ప్రసాదాలతో పాటు మెమంటోలు అందించి వేదాశీర్వచనం చేశారు.